క్లుప్తంగా

విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న వికాస్ హైస్కూల్‌లో విద్యార్థులకు ధ్యానంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. పిరమిడ్ స్పిరుట్యువల్ సొసైటీ మూమెంట్, శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి, దీనివల్ల కలిగే లాభాలను శిక్షకులు వివరించారు. స్కూల్ డైరెక్టర్ వేణుగోపాల్, శిక్షకులు, టీచర్లు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే ఉపాధి లక్ష్యం


వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ జీవీ చిట్టిరాజు

గార: గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర వనరుల సృష్టించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యమని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని వాడాడలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. గ్రామాల్లో ఆర్థిక అసమానతలు రూపుమాపడంతోపాటు వలసల నివారణ కోసం ఈ పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. 100 రోజుల పని దినాలను ప్రతీ వేతనదారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనులు నాణ్యతతోపాటు పారదర్శకంగా ఉండాలన్నారు. ఏపీఓ సంధ్యారాణి, జేఈ నారంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

రణస్థలం: యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్సై ఎస్.కె.రహీమ్ అన్నారు. మండల కేంద్రంలోని సాయి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగ తాగడం, మద్యం సేవించడం, డ్రగ్స్ వాడడం వలన క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాలు వచ్చి జీవితం సగంలోనే ముగిసి పోతుందన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు విద్యార్థి ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం పరిధిలోని నైరా కళాశాలలో చదువుతున్న విద్యార్థి సనపల జ్యోత్స్న అమెరికాలోని మాసాచుసెట్స్ యూనివర్సిటీకి ఎంపికై నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 20 నుంచి మార్చి 31 వరకు రెండు నెలలపాటు ఇంటర్న్‌షిప్ ఉంటుందన్నారు. విద్యార్థిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

ఎంపీటీసీ సభ్యురాలికి పరామర్శ


సూరీడమ్మను పరామర్శిస్తున్న సాయికుమార్

లావేరు: బుడుమూరు ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డ సూరీడమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలియడంతో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు తదితరులు సూరీడమ్మను మంగళవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బుడుమూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు రేగాన రాంబాబు, పార్టీ నాయకులు ఉన్నారు.

ఆత్మహత్యలకు పాల్పడవద్దు

లావేరు: క్షణికావేశంలో బాలబాలికలు ఆత్మహత్యలకు పాల్పడరాదని మురపాక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వి.శాంతి, మురపాక గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. మురపాక శాఖాగ్రంథాలయంలో మంగళవారం ఆత్మహత్యల నివారణపై బాలబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని బాగా చదువుకోవాలన్నారు.

ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో రాణించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా అంతర్ యూనివర్సిటీ బాల్ బాడ్మింటన్ క్రీడాపోటీల్లో రాణించి పతకంతో తిరిగి రావాలని లయన్ క్లబ్ రీజనల్ చైర్మన్ నటుకుల మోహన్ పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర కళాశాలల బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని ఒనుము జ్యోతి అంతర విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికైంది. చెన్నైలోని క్రీసెంట్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 26వ నుంచి ప్రారంభంకానున్న ఈ పోటీల్లో జ్యోతి బీఆర్ఏయూ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు క్రీడాకారిణికి రాకెట్‌ను బహుకరించారు. లయన్స్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ సునీల్, బాల్ బాడ్మింటన్ కోచ్ కోడి మోహనరావు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణిస్తున్న బాలికలు

- ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు


లావేరు: సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అప్పారావు

లావేరు: బాలికలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని.. వారు ఎందులో కూడా తక్కువ కాదని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. తామాడ గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, ఉచిత విద్య, నిర్బంధహక్కు, పోక్సో చట్టాలపై బాలికలకు అప్పారావు వివరించారు. నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న సంఘటనలు తెలియజేసి జాగ్రత్తగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. మహిళలు అంతరిక్షానికి కూడా వెళుతున్నారని, ఏ విషయంలో కూడా వారు తక్కువ కాదన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బాలికలు నడుచుకోవాలన్నారు. భయాన్ని విడిచిపెడితే భవిష్యత్తు అందంగా ఉంటుందన్నారు. ప్రణాళికా బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోందని.. వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ, ఐసీడీఎస్ పీవో ఝాన్సీరాం, పీవో మల్లేశ్వరరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.డేనియల్, ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, మహిళా మార్గదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చదువులో ప్రోత్సహించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: బాలికలను చదువులో ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.యశోద అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా బొంతలకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికా విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. వ్యక్తి గత పరిశుభ్రతపై బాలికలు దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.ఆనందరావు, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం గ్రంథాలయంలో..

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో బాలికా దినోత్సవాన్న నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లపై ప్రత్యేక దృష్టిని సారించే విధంగా ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. డిబేటింగ్ పోటీల్లో గెలుపొందిన ఎం.యామిని, ఎ.లాస్య, ఎస్.షర్మిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ, స్కూల్ కరస్పాండెంట్ జయరాం, ప్రిన్సిపాల్ ఆర్.ఇందుమతి, ఉపాధ్యాయులు వై.రమేష్, ఎం.ఆరుణ, రజని,డి.ఉషారాణి, పద్మ పాల్గొన్నారు.


ఎచ్చెర్ల క్యాంపస్: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద


రణస్థలం: బాలికలకు అవగాహన కల్పిస్తున్న చైల్డ్‌లైన్, యూత్ క్లబ్ సభ్యులు

ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

లావేరు: బాలికలు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని వెంకటాపురం హైస్కూల్ హెచ్ఎం ఎం.అరుణకుమారి అన్నారు. ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో వైసీబీ ఆధ్వర్యంలో స్కూల్ రెడినెస్, బాలవికాస్ కార్యక్రమంలో భాగంగా హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికలకు వక్తృత్వ, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొంతు ఎల్లంనాయుడు, వావిళ్ల రామారావు, ఇండియా లిటరసీ ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎస్.కల్యాన్, చైల్డ్‌లైన్ టీమ్ సభ్యురాలు డి.మౌనిక, పి.సాయిలక్ష్మి పాల్గొన్నారు.


ఎచ్చెర్ల: విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


లావేరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం అరుణకుమారి


జి.సిగడాం: కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు, సిబ్బంది

లంకపేటలో..

రణస్థలం: బాలికలు చక్కగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇండియా లిటరసీ ప్రాజెక్టు ఆర్గనైజర్ ఎ.రమణమూర్తి, చైల్డ్ లైన్ టీమ్ సభ్యులు డి.మౌనిక, పి.సాయిలక్ష్మి అన్నారు. లంకపేట హైస్కూల్లో బాలికా దినోత్సవం సందర్భంగా యూత్ క్లబ్ బెజ్జిపురం ఆధ్వర్యంలో స్కూల్ రడీనెస్, బాల వికాస్ ప్రోగామ్ నిర్వహించారు. బాలికలకు వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు బి.జయదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీలో..

జి.సిగడాం: బాలికల హక్కులను వినియోగించుకోవాలని స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారిణి ఉషారత్నకుమారి అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. బాలికల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బాలికా విద్యతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన


వి.ఎస్.పురంలో మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- యర్రవరం సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో పారదర్శకపాలన నడుస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. యర్రవరం గ్రామ సచివాలయ పరిధి వి.ఎస్.పురం, మిందిపేట, చిన్నయాతపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. 249 గడపలకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేకూరిన సంక్షేమాన్ని చదివి వివరించారు. వీధిలో కాలువలు నిర్మించాలని స్థానికులు కోరగా.. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో వి.ఎస్.పురం పంచాయతీలోని అన్ని గ్రామాలకు కాలువలు నిర్మించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు మైలపల్లి కామరాజు, పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, లంకలపల్లి ప్రసాద్, పైడి శ్రీనివాసరావు, అప్పలనర్సునాయుడు, చినరామినాయుడు, గ్రామ నాయకులు లంక సీతంనాయుడు, రెడ్డి అప్పలనాయుడు, మింది జనార్దన్‌రెడ్డి, మింది శ్రీనివాసరెడ్డి, లంక రమణ, జగ్గురోతు రాజారావు, రెడ్డి రమణ, బాసి రమణ, అక్కులరెడ్డి, మింది లక్ష్మణరెడ్డి, జగ్గురోతు అప్పలనాయుడు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

• అర్హతే ప్రామాణికం


సంక్షేమ పథకాలను వివరిస్తున్న యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. నగరంలోని 20వ డివిజన్‌లో వానపిల్లి రమేష్, గంగాధర్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం 6 గంటలకే వలంటీర్లు వచ్చి పింఛన్లు అందిస్తున్న తీరును చూసి టీడీపీ నేతలు ఓర్వలేక పోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వలంటీర్లు సైనికుల్లా పనిచేయడం వల్లే సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందించగలుగుతున్నామన్నారు. 20వ డివిజన్‌లో ఇప్పటివరకు సంక్షేమ పథకాల రూపేనా రూ. 4.50 కోట్లు, జగనన్న ఇళ్లకోసం రూ. 14.79 కోట్లు అందించామన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన వ్యక్తి ధర్మాన ప్రసాదరావు అనే విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఇంటింటికీ కుళాయిలు ఇచ్చి తాగునీటి కష్టాలు తీర్చిన వ్యక్తి ధర్మాన అని అన్నారు. చంద్రబాబు, పవన్ ఇటీవల జిల్లాకు వచ్చి నిరుద్యోగుల కష్టాలు తీరలేదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగాలు, వలంటీర్లను, వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను భర్తీచేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. పవన్‌కు కావాల్సింది ప్యాకేజీయో తప్ప.. పేదోడి బాధలు అవసరం లేదన్నారు. నిరంతరం చంద్రబాబు సంక్షేమం ఆలోచించే వ్యక్తి పవన్ అని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పెరిగాయని, అన్నింటికంటే మన రాష్ట్రంలోనే తక్కువగా ఉన్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి, సాధు వైకుంఠరావు, ఎం.వి స్వరూప్, ఎండ రమేష్, ఆలుగుబిల్లి నాగభూషణరావు, కోటిపల్లి మోహనరావు, హారికా ప్రసాద్, పైడి మహేశ్వరరావు, పీస గోపి, అల్లు లక్ష్మీనారాయణ, వాసు, అలిగి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని హరేరామ మందిర ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 44 ఏళ్లక్రితం నిర్మితమైన ఈ మందిరం శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులంతా కలిసి మందిర పునర్ నిర్మాణపనులు పూర్తిచేశారు. మూడురోజులపాటు జరిగే ఈ ప్రతిష్ఠ ఉత్స వాలలో భాగంగా తొలిరోజు సీతారామచంద్రమూర్తి, లక్ష్మణ, ఆంజనేయ సమేతంగా రథంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామపెద్దలు రెడ్డి చిరంజీవులు, సాధు వైకుంఠరావు, బాన్న రమణమూర్తి, చిట్టి నాగభూషణం, బలగ గణపతి పట్నాయక్, హరేరామ మందిర అధ్యక్షుడు సాధు అప్ప న్న, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

- పట్టుశాలి సంఘం క్యాలెండ్, డైరీ ఆవిష్కరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పట్టుశాలి కులస్తులంతా ఐక్యమత్యంగా మెలగాలని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. మార్కండేయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టుశాలి సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి అన్ని కులాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. సంఘ అధ్యక్షుడు పసగాడ రామకృష్ణ, వై.శ్రీనివాసులు, వై.రుక్మయ్య, టి.ప్రసాదరావు, నీలయ్య, పి.చిన్నారావు, షన్ముఖరావు, ఎన్.వి రమణ, మల్లిబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు, సంఘం సభ్యులు

రిపబ్లిక్ డే వేడుకలకు ఏర్పాట్లు


మార్కింగ్ చేస్తున్న పోలీస్ సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: రిపబ్లిక్ డే వేడులకు ఏర్పాట్లు మొదలయ్యాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన వేదికతోపాటు గేలరీలు సిద్ధం చేస్తున్నారు. మార్చ్‌ఫాస్ట్, పోలీస్ పెరేడ్‌కు మార్కింగ్‌లు చేస్తున్నారు. పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్స్ గైడ్స్, విద్యార్థులు పెరేడ్ కోసం సన్నద్ధమవుతున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం వివిధ పాఠశాలల విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ పనితీరును, ప్రగతిని ప్రతిబింబించే వివిధ ప్రభుత్వ శాఖల శకటాలను మైదానంలో సిద్ధం చేస్తున్నారు.

కౌండిన్యకు నర్తన పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: నాగపూర్‌లో ఈ నెల 19 నుంచి 22 వరకు జరిగిన కృష్ణమయూఖం నృత్యోత్సవాల్లో శ్రీకాకుళం పట్టణానికి చెందిన నృత్యదర్శకుడు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యుడు రామకౌండిన్య కూచిపూడి నాట్య ప్రదర్శించినందున ఉత్తమ నర్తన పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి కూచిపూడి విభాగానికి కౌండిన్య ఎంపిక కాగా రాష్ట్ర సంత్ తుకాడోజీ మహారాజ్ నాగపూర్ విశ్వవిద్యాలయం లలితకళా విభాగాధిపతి సంయుక్త, శ్రీకృష్ణ సాంస్కృతిక సంచాలకులు ప్రమీల ఉన్ని కృష్ణన్, కథక్ నిపుణులు లలిత హర్దాస్, ప్రముఖ తబలా నిపుణులు అనిరుధ్ దేశ్‌పాండేలు రామకౌండిన్యను సత్కరించారు.


రామకౌండిన్యను పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

ఎంపీటీసీ సభ్యుల సంఘ అధ్యక్షుడుగా తవిటినాయుడు


ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న తవిటినాయుడు

రణస్థలం: లావేరు మండల ఎంపీటీసీ సభ్యుల సంఘం అధ్యక్షుడుగా గుమ్మడాం ఎంపీటీసీ జగ్గురోతు తవిటినాయుడు ఎన్నికైనట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు అధ్యక్షుడిగా ఎన్నికైన తవిటినాయుడు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో లావేరు మండల వైస్ ఎంపీపీ ఆలుపన నారాయణరెడ్డి, సర్పంచులు దురగాసి ధర్మారావు, కలిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యులు జనపాల భానోజీరావు, ఇనపకుర్తి సతీష్, బొడ్డ రవికుమార్, లంక రామినాయుడు, దొండపాటి చిరంజీవి, గంట్యాడ సత్యం, ఇజ్జాడ రాముడు, తేనెల సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి శ్రీరాములు, తార అప్పలరాజు, నాగం కనకరాజు, వాళ్లె రమణ, మోహన్‌రెడ్డి, జగ్గురోతు జగదీష్, లుట్ట శ్రీనివాసరావు ఉన్నారు.

ఆదిత్యుని ఆలయానికి వాకీటాకీల అందజేత


వాకీటాకీలను అందజేస్తున్న షన్ముఖరావు, నీలవేణి దంపతులు


నిత్యాన్నదానానికి రూ.లక్ష చొప్పున విరాళం అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో భద్రతలో కీలకమైన సెక్యూరిటీ సిబ్బంది వినియోగానికి ఏడు వాకీటాకీ కిట్లును జిల్లా వాసులు టంకాల షణ్ముఖరావు, నీలవేణి దంపతులు మంగళవారం ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. రూ.లక్ష విలువైన ఈ సామగ్రిని ఆలయ వినియోగానికి ఇస్తున్నట్లుగా దాతలు ప్రకటించారు. ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శ్రీకాకుళం నగరానికి చెందిన కొత్తకోట నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి రూ.లక్ష నగదును, నరసన్నపేటకు చెందిన కలివరపు రుక్మిణమ్మ తన భర్త రమణయ్య జ్ఞాపకార్థం రూ.లక్ష అందజేశారు.

సిక్కోలు ప్రభంజనం


ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాల్‌బాడ్మింటన్ క్రీడాకారుల బృందం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో సిక్కోలు ప్రభంజనాన్ని సృష్టించింది. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఈ నెల 23, 24వ తేదీల్లో 66వ ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్–17 బాలబాలికల బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలికలు జట్టు ఒక్క మ్యాచ్‌లోనూ (సెట్‌లో కూడా ఓటమికాలేదు) విజేతగా నిలవగా, బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచి సత్తాచాటాయి. బాలికలు జట్టు ఫైనల్‌లో గుంటూరు జట్టును చిత్తు చేసి విజయకేతనం ఎగురవేసింది. బాలుర జట్టు విశాఖపట్నంతో బెస్ట్ ఆఫ్ త్రీ పోరులో ఓటమిపాలై రన్నరప్‌తో సరిపెట్టుకుంది. జిల్లా బాల్ బాడ్మింటన్ బృందానికి కోచ్, మేనేజర్‌గా పీఈటీ ఎం.మధుసూదన్ వ్యవహరించారు. బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులను డీఈఓ గార పగడాలమ్మ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు, జిల్లా పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, సెట్ శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి పి.సుందరరావు తదితరులు అభినందించారు.

ఉత్సాహంగా సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీఎం కప్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ మంగళవారం ఉత్సాహభరితంగా జరిగాయి. శాప్ ఆదేశాల మేరకు నిర్దేశించిన పలు క్రీడాంశాల్లో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా పురుషులు, మహిళలకు ఈ పోటీలను నిర్వహించారు. కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, బాక్సింగ్, టెన్నిస్, బాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశాల్లో ఈ పోటీలు జరిగాయి. టేబుల్ టెన్నిస్ పోటీలు మాత్రం నగరంలోని పీఎన్‌కాలనీలో గల న్యూసెంట్రల్ స్కూల్ వేదికగా నిర్వహించారు. విజేతలగా నిలిచిన క్రీడాకారులకు జేసీ ఎం.నవీన్ బహుమతులు, పతకాలను అందజేశారు. అధికారులు సంబంధిత క్రీడా సంఘాలకు కనీస సమాచారం ఇవ్వకపోవడంతో కొన్ని క్రీడాంశాల్లో ఎంపికలకు కనీసం క్రీడాకారులు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. ఒలింపిక్ సంఘ కార్యదర్శి పి.సుందరరావు, సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, ఎన్‌వైకే యూత్ కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి

రణస్థలం: పాతర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ పిన్నింటి రజని అన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేలా వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. మంచి వైద్య సేవలు అందిస్తే పీహెచ్‌సీపై ప్రజలకు నమ్మకం పెరుగుతోందని.. తద్వారా ఆస్పత్రికి మంచి పేరు వస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్పత్రుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది ఎంపీపీ రజిని దుశ్శాలువతో సత్కరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎంపీడీవో ధనుంజయరావు, వైద్యులు క్రిష్ణ చైతన్య, గిరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె సీతారాం ఉన్నారు.

రాజీయే రాజమార్గం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బ్యాంకు కేసులు, చిట్ ఫండ్, బీఎస్ఎన్ఎల్ కేసులు ఎక్కువ సంఖ్యలో జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలని, రాజీయే రాజమార్గమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ మాట్లాడుతూ కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ ఉపయోగించుకోవాలన్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశం కల్పించడం జరుగుతున్నందున, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. బ్యాంకులు, చిట్ ఫండ్స్ అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ముందు ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ లేకుండా చూడాలని ఆర్టీసీ ట్రాఫిక్ సిబ్బందికి, ట్రాఫిక్ గైడ్‌లకు శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ సూచించారు. కాంప్లెక్స్‌కు ముందు భాగంలో ఆటోలు, ప్రైవేట్ వాహనాలు నిలుపుదల చేయకుండా ఆర్టీసీ అధికారులు, సిబ్బంది మంగళవారం శ్రీకాకుళం 1, 2 డిపోల ఆధ్వర్యంలో పరిరక్షణ కూటమి ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఆర్టీసీ రెండో డిపో మేనేజర్ కెవిఎస్ఆర్ శర్మ, ఆర్టీసీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు, ఈకేవైసీ తప్పనిసరి

జి.సిగడాం: రైతులు పండించే ప్రతి పంటకు తప్పని సరిగా ఈ–క్రాప్ నమోదుతోపాటు ఈకేవైసీని కూడా రైతులు చేయించుకోవాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందన్నారు. రైతులకు రాయితీపై పనిముట్లు అందిస్తున్నామన్నారు. ఏఓ యర్రా శారద పాల్గొన్నారు.